# షూటింగ్ చూడటానికి

"భానుమతి—ఎంత హాయి ఈ రేయి-అని మల్లీశ్వరిలో పాడుతున్నప్పుడు మానససరోవరంలో రాజహంసలు విహరిస్తున్నట్టు ఉంటుంది సుమండీ!"

"పెళ్ళిచేసి చూడులో జి. వరలక్ష్మి ఏడుకొండలవాడ, వెంకటారమణా-అని పాడుతున్నప్పుడు మానససరోవరంలో రాజహంసలు విహరిస్తూవుండగా చంద్రోదయ మైనట్టు ఉండదూ?"

"పప్పులో కాలేశారులెండి. ఆ పాట పాడినది జి. వరలక్ష్మి కాదు" అంది శాంతాదేవి.

"దబాయించకు మరి. నేను కళ్ళారా చూశానుగా! ఆ పాట వింటూవుంటే నాకు నిద్దర వచ్చేసిందంటే నమ్ము."

"మీ ధర్మమా అని థియేటర్లోనే నిద్దరపోలేదు. మై డియర్ సార్, ఏడుకొండలవాడా—పాటపాడినది పి. లీల; జి. వరలక్ష్మి మట్టుకు కాదు."

"ప్లేబాక్ అంటావా?" అన్నాను వోడిపోతున్నానని తెలిసినప్పటికీ, అంత సులువుగా వోటమిని అంగీకరించడం యిష్టంలేక.

"నిక్షేపంగా, రేడియోలో పెడుతున్నప్పుడు ఆ పాట పాడినవారు పి. లీల అని చెప్పగా మీరు వినలేదూ?"

నిజానికి నేను వినలేదు. వినడం ఎలా? రేడియోవాళ్ళు ఫిలిం సంగీతం తగ్గించేసినప్పట్నుంచీ, ఎల్లవేళలా సిలోన్,

గోవా, పాకిస్తాన్ మాత్రమే వినిపిస్తున్నాయి. ఆ స్టేషనుల నుంచి ఏ ప్రోగ్రామూ లేక ఖాళీగావున్నప్పుడే, నేటికాలపు మహిళలు ఆలిండియా రేడియోని కాస్త పాట్రనైజ్ చేస్తున్నారు. లతామంగేష్కర్ కంఠాన్ని అమాంతం నొక్కేసి, ఏ టూత్ పేస్టు పళ్ళకి మంచిదో, ఏ సబ్బు ఎక్కువ నురగ నిస్తుందో, ఏ హెయిర్ టానిక్ వల్ల శిరోజాలు బారులు బారులుగా పెరుగుతాయో వాళ్ళు చెబుతున్నప్పటికీ మన ఆడంగులు, బియ్యంలోనూ, పప్పులోనూ రాళ్ళు ఉండకుండా వుంటున్నాయా అను మెట్ట వేదాంతంతో, దూరపు సంగీతాన్నే శ్రద్ధగావిని, కూరముక్కలు వేయిస్తున్నప్పుడు ఆ పాటలు తమలో తాము పాడుకుంటున్నారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, ఏ స్టేషన్నించి అయినా చక్కటి హిందీపాటలు ఉన్నాయంటే, ఆంధ్రరాష్ట్ర విషయాలు తెలుసుకునేందు కూడా న్యూస్ పెట్టదు శాంతాదేవి. అంచేత, ఏ ఫిలిమ్‌లో ఏ పాట ఎవరు పాడారు ?—అనే తప్సీళ్ళు నా కంతగా తెలీనూ తెలీవు; తెలుసుకోవాలనే ఆసక్తి లేదు.

"ఏమండీ—మన మొకసారి షూటింగ్ చూడాలి" అంది శాంతాదేవి.

"నాకు వాళ్ళెవరూ తెలీదు."

"తెలిసేదేముంది? చూడటానికి వచ్చామంటే రానివ్వరా? సిరపూర్ పేపర్ మిల్స్ కంటె, గుల్ బర్గా క్లాత్

మిల్సుకంటె, పెరంబూర్ వర్క్ షాప్ కంటె ఈ ఫిలిమ్ స్టూడియోలు గొప్పవా యేమిటి—ఒకసారి చూస్తామంటే రానివ్వకపోయేందుకు !"

"గొప్పవి కావనుకో, చూస్తామంటే రానివ్వకపోరు. అక్కడివాళ్ళని బతిమాలుకోవాలి. గేటుదగ్గిర ఘూర్ఖాలు యమభటుల్లా నుంచుంటారు. ఘూర్ఖా యిబ్బంది లేకుండా ఏ టాక్సీలోనో తిన్నగా పోయామా, రిసెప్షన్ దగ్గిర గుమాస్తా—ఎందుకొచ్చారు, ఎవరికోసమొచ్చారు, ఏం పనిమీద వచ్చారు ?—అని చొప్పదంటు ప్రశ్నలతో నిలవేస్తాడు. పెళ్ళిలో వడ్డించే పులిహోర, వంటబ్రాహ్మడు, కాళ్ళతో తొక్కి తాడనేవిషయం తెలిసివుంటే, మనం తినగలమా ? మనకి సినీమాలో కనిపించే రాజభవనాలు అట్టమేడలని తెలియగానే కల సగం కరిగిపోతుంది."

"చేతకాదని చెప్పకూడదూ? ఈ డొంకతిరుగుడు మార్గం ఎందుకు ?"అని సూటిగా ఎదుర్కొంది శాంతాదేవి.

నాకు సినీమా స్నేహితులెవరూ లేరు. నా తోడివాళ్ళందరూ పదింటికి ఆఫీసుకి పోయి అయిదింటికి యింటికివచ్చే బుద్ధిమంతులూ, సత్పురుషులూను. శాంతాదేవి నన్ను నిలవదీసి మాత్రం ప్రయోజనం ఏమిటి ? సినీమావాళ్ళెవరూ నాకు తెలీదని తనకి తెలీదుకనకనా ! అయిదారేళ్ళక్రితం ఎవరో స్నేహితులు నన్ను షూటింగ్ చూడటానికని పట్టుకుపోయారు. ఆవేళ రాత్రి పదకొండు గంటల నుంచీ తెల్లారి గట్ట కాకులు కూసేదాకా సెట్ మీద ఉన్నాం. మా స్నేహి

తు లెంతో మెచ్చుకున్నారుగాని నాకేమీ నచ్చలేదు. వంటగది పొగలో కూచుని అన్నం తింటే సయిస్తుందా?

"అవును. చేతకాదు" అన్నాను.

"మొహం అలా పెడతారెందుకు? ఏమీ తప్పుమాట అనలేదుగా! చేతకానిది చేతకాదు-అంటే, అంత ఉక్రోసం ఎందుకు? ఈ షూటింగ్ చూడనంత మాత్రాన ప్రాణాలు పోవు. ఏదో తమాషాకి అడిగాను" కుంపటి నెమ్మది నెమ్మదిగా రాజుకుంటోంది.

"అదికాదు, శాంతా!"

"నన్ను మాటల్లోకి దించకండి; నిష్కారణం దెబ్బలాడుతాను. ఇప్పటికే గయ్యాళి దానినని పేరు తెచ్చుకున్నాను. మీరు గంగిగోవులాటివారు, నేను గయ్యాళిదాన్నీను. మీరు కనక నాతో వేగుతున్నారు." గబగబా చదవడం మొదలెట్టింది, శాంతాదేవి.

"నువ్వు గయ్యాళివని ఎవరన్నారు?"

"మా మేనత్తే అంది."

"నేను అనలేదుగదా!"

"నా ఖర్మంకాలి మీచేతకూడా అనిపించుకోవాలి!" ఆకాశాన హరివిల్లులా ఆమె పెదవులమీద చిరునవ్వు తొలుకాడింది.

"శాంతవంటి పిల్ల లేదోయ్ లేదోయ్" అన్నాను.

"అహా. మహా ముచ్చటగా ఉంది"

* * * *

స్నేహితులలో రెండు రకాలవారున్నారు. ఒకరకంవారిని మనం ఆదుకోవాలి; ఇంకోరకంవారు మనని ఆదుకుంటారు. రెండో రకానికి చెందుతాడు ముకుందంగారు. ఏ ఎండ కా గొడుగు ఆయన పట్టగలడు కనకనే ఎందరో ఆయనకి తెలుసు. తెలుగువారికి ఆయన ముకుందం; తమిళులకి ఆయన ముకుందన్; మిగతా వారికి ఆయన ముకుంద్. ముకుందంగారు మాకు షూటింగ్ చూపిస్తానన్నారు. డైరెక్టర్ వైకుంఠం ఆయన చిరపరిచితుడు. వాళ్ళిద్దరిదీ బహుకాల పరిచయం. వైకుంఠం వామువాటర్ బాటిల్స్ అమ్మేరోజులనుంచీ ముకుందంగారికి తెలుసునట. వామువాటర్ బాటిల్స తర్వాత కొన్నాళ్ళు జపాను ఫవుంటెన్ పెన్నులు అమ్మేడట వైకుంఠం. తర్వాత ఏడురకాల ఉద్యోగాలుచేసి, ఈ సినిమా లైనులో తలదూర్చి, నోరుగలవాడు కాబట్టి నాలుగేళ్ళలో డైరెక్టరై ఊరుకున్నాడట.

"వైకుంఠం తీసిన ప్రతీదీ బాక్సాఫీస్ హిట్ కాకపోయినా, ఆయనపేరు చెబుతే నిర్మాతలు లక్షలకి లక్షలు కుమ్మరిస్తారు", అన్నారు ముకుందం. మేము వడపళనివైపు టాక్సీలో వస్తూవుండగా, 'మేము' అనగా నేనూ, శ్రీమతీ, సుమతీ, ముకుందమూను. ముకుందంగారిభార్య తనకి పడయితే నిద్దరకళ్ళమీదకి కూరుకువస్తుందిగనక షూటింగూ వద్దు. గీటింగూవద్దు-అంది. అదీగాక, పిల్లలున్నారుగదా, వాళ్ళకి కాపలా ఉండాలి. పదేళ్ళలోపు పిల్లల్ని షూటింగ్‌కి

తీసుకు రావద్దని ముందే వార్నింగ్ యిచ్చాడట వైకుంఠం. అంచేత, 'మేము' అనగా మేము నలుగురమూను.

ముకుందం చెప్పిన స్టేటుమెంటు విషయమై శాంతాదేవికి ఒక సంశయం తోచి "బాక్సాఫీస్ యేమిటండీ!" అంది.

ముకుందానికి నవ్వాగలేదు. కాని పరాయపడుచు ఏదో ప్రశ్నఅడిగితే, సమాధానం చెప్పాలిగాని నవ్వకూడదని తెలిసిన ప్రాజ్ఞుడు కాబట్టి 'బాక్సాఫీస్ హిట్స్' అయిన కొన్ని తెలుగుచిత్రాల పేర్లుచెప్పి, ఆ పారిభాషిక పదాన్ని సోదాహరణంగా వివరించాడు.

"ఏ చిత్రాన్నయితే వెర్రిబాగులవాళ్ళు ఎక్కువగా చూస్తారో అది 'హిట్' అన్నమాట. అలాటి సందర్భంలో మనకి హిట్స్ తక్కువ ఉండటమే మంచిది" అంది శాంతాదేవి.

తెలుగు చిత్రాలు మాలాటివాళ్ళు—అనగా నేనూ శాంతాదేవిలాటివాళ్ళు చూసేందుకు నిర్మించరు. అవి చూసేందుకు వేరేరకం మనుషులు విశాలాంధ్రలో ఉన్నారు. మాలో ఆంధ్రత్వం లేక కాదు- ఆ మాట అంటూంట. నిజానికి మేము పదహారు అణాల ఆంధ్రులం. 'ఆంధ్రులం మేమాంధ్రులం' అన్న గేయం నిత్యమూ ఆలాపిస్తూఉంటాం. కాని మద్రాస్ మహానగరంలో వున్న మాకు తెలుగుచిత్రాలు చూసే యోగ్యత అనండి, అవస్థ అనండి, అది ఎప్పుడో గాని పట్టదు. మేము వారానికి ఒకసారే సినీమాకి వెళ్తాం; ఆవేళ

ఏదో మంచి యింగ్లీషుచిత్రమో, హిందీచిత్రమో ఉంటుంది. ఈ చేటభారతం ఎందుకు చెప్పొచ్చానంటే తెలుగుపిక్చర్సు గురించి మాకున్న అభిప్రాయం సినీమా పత్రికాధిపతులు ప్రచురించే ప్రజాభిప్రాయం ఎంతమాత్రమూ కాదు.

ముకుందం చిత్రనిర్మాణ పరిశ్రమలోని సాధకబాధకాలు (పేపర్ల ద్వారా చదివినవి) చెప్పడం మొదలెట్టారు. చిత్రనిర్మాణం పరిశ్రమగాదనీ, పరిశ్రమకి కావలసిన లక్షణాలు యిందులో లేవనీ, వినోద వ్యాపారం భారీపరిశ్రమకు కావలసిన అంతస్తుని ఏనాడు అందుకోలేదనీ నేను చెప్పడం మొదలెట్టాను. ఇద్దరిదీ ఊకదంపే అనుకోండి. ఎందుకంటే ఇద్దరమూ వార్తాపత్రికలని ఆధారంగా చేసుకొనే మాట్లాడగలము. ప్రత్యక్షానుభవం యిద్దరికీ లేదు.

ఇంతలో టాక్సీ రపీమని ఆగింది. రిసెప్షన్ దగ్గిర నుంచున్న కుర్రవాడు మేము వైకుంఠంగారి తాలూకు అవునో కాదో అడిగి తెలుసుకొని, అవునని నిశ్చయమైన పిమ్మట లోపలికి నడిచాం.

“బావా టాక్సీని పంపించేస్తున్నావ్. అర్ధరాత్రివేళ ఈ అడివిదాటి మనం యిల్లు ఎలా చేరుకుంటాం.” అని అడిగింది సుమతి, తన బావగారైన ముకుందాన్ని.

“ఏమీ ఫరవాలేదు. వైకుంఠం తన కారులో పంపిస్తాడు మనని. ఏమయినా మూడుగంటలయితేగాని బయటికి తెమలముగా! ఇప్పుడు పదీనలభై అయిదేగా అయింది. ఏమండీ శాంతాదేవీ నిద్దరవస్తోందా ?”

"ఒక్క రాత్రికి నిద్దర ఆపుకోలేని దాన్ని అనుకున్నారా?" అంది శాంతాదేవి. స్టుడియో విద్యుద్దీపాల కాంతిలో శాంతాదేవి కట్టుకున్న మామిడిపండు రంగుపట్టుచీర తళతళా మెరిసింది. అప్పుడే తమలపాకులు నమిలి ఉండటంవల్ల అధరం మీద ఏర్పడిన ఎర్రజీర లోకాన్ని వెక్కిరిస్తున్నట్టుంది. ఆమె వాల్జడలోని కదంబపరిమళం క్షణక్షణానికి నా అదృష్టాన్ని కొనియాడుతోంది. చెవులరవ్వలదుద్దులూ కాళ్ళ ముఖమల్ స్లిప్పర్సూ సమాజ జీవనంలో శాంతాదేవి తరహా ఏమిటో నిర్ణయిస్తున్నాయి. ఆ సుందరమూర్తి వెనకగా తెల్లపంచె తెల్లషర్టూ వేసుకు నడుస్తున్న వినయవిధేయవర్తనుడు, ఆవిడ, భర్తగారు. కొన్నికొన్ని వేళల శాంతాదేవి సోయగం చూస్తూవుంటే నా కళ్ళు చెదురుతాయి. కొన్నేళ్లు కాపరం చేసిన తర్వాత ఎంత అందగత్తె అయినా, భార్య అలవాటై పోతుందట. కాని, నాకళ్ళకి మాత్రం శాంతాదేవి సౌందర్యం సంవత్సరం సంవత్సరానికీ పెరుగుతోంది. ఆ సౌందర్యం నాహృదయకల్పన కావచ్చు. ఎంచేతననగా, రూపు రేఖలలో శాంతాదేవి మా చెల్లెలికి సరిరాదు.

ఫ్లోర్‌లోకి వెళ్ళేటప్పటికి వైకుంఠంగారే ఎదురొచ్చారు. ముకుందం మమ్మల్ని ఆయనకి పరిచయం చేశాడు. ఒక అయిదు నిముషాలు మాతో యిష్టాగోష్టి మాట్లాడి ఆయన తనపనిలోకి తనుచొరబడ్డాడు.

మా నలుగురికీ ఒక మూలగా కుర్చీలు వేశారు. మేము కుర్చీలలో చతికిల బడగానే ఒకతను నాలుగుగ్లాసులలో టీ

పట్టుకొచ్చాడు. మా గ్రూపుకి ముకుందం ప్రతినిధికనక, ఆయన గ్లాసులు ఒక్కొక్కటే మాకందిచ్చాడు. సుమతి తనకి టీ సయించదంది. ఆ బాయ్ తక్షణం పరుగెట్టుకెళ్ళి ఓవల్టిన్ తీసుకొచ్చాడు. ఈ మర్యాదకి సుమతీ, శాంతా శాస్త్ర వుక్కిరి బిక్కిరి అయారు. శాంతాదేవి టీ తాగనని మొరాయిస్తుందేమో అనుకున్నానుగాని మంచి పిల్లలా తాగింది. నా సంగతీ, ముకుందంగారి సంగతీ వేరే చెప్పాలా ? టీ తాగటమే కాకుండా, వైకుంఠంగారు ఆఫర్ చేసిన సిగరెట్లు కూడా అంటించాము.

"మా బావ కాలుస్తారని తెలుసుగాని, మీ ఆయన సిగరెట్లు కాల్చడం నే నెప్పుడూ చూడలేదే!" అంది సుమతి శాంతాదేవితో.

"లక్షణాల కేమిలోటు! పాపం వీళ్ళిద్దరూ యింక దున్నపోతుజన్మ నుంచి విముక్తులవుతారు" అంది శాంతాదేవి.

నాకంతా వినిపిస్తూనే ఉంది. విననట్టు వైకుంఠంగారి మొహంవంక చూస్తున్నాను.

"ఇవ్వాళ పన్నెండుగురు ఎక్స్ట్రాలు ఉన్నారు. మెయిన్ రోల్స్ మనోరమ, భీమారావ్, బేబీరామ్......"

వైకుంఠం యింకా ఏదో చెప్పబోతూ వుండగా, నన్ను అడుగుతున్నట్టుగా "యింకా ఎంతసేపటికి ప్రారంభమవుతుందండీ షూటింగ్!" అంది శాంతాదేవి.

వైకుంఠం అందుకొని అన్నాడు. "ఇప్పుడు పదకొండుంబావు అయిందా? పన్నెండు అయ్యే వేళకి లైటింగ్

యరేంజిమెంట్ పూర్తవాలి ఒక్కొక్క గంట గడిచిందంటే నూటయిరవయ్యేసి రూపాయల చొప్పున హరించుకుపోతుందన్నమాట. నిముషానికి రెండేసి రూపాయలు. కొవ్వొత్తి రెండువైపులా వెలిగించడం లాంటిదండీ ఈ వ్యాపారం. యాస్'' అంటూ హడావిడిగా పరిగెట్టాడు వైకుంఠం.

"కొవ్వొత్తి రెండువైపులా వెలిగించడ మేమిటండీ! అలాటి సీను ఏమయినా యిప్పుడు తీస్తున్నారా?" అని అడిగింది సుమతి నన్ను ఉద్దేశించి.

నేను సమాధానం ఆలోచిస్తూవుండగా ముకుందంగారు అన్నారు; "Burning the candle at both ends" తెలుగులోకి తర్జుమా అయితే ఆ రూపం తీసుకుంది. మోత...గిడి గిడి...తస్సాదియ్యా—యివన్నీ సినీమా మంత్రాలు."

"బావా, నువ్వుకూడా వైకుంఠంగారి లాగానే మాట్లాడుతున్నావేమిటి? ఆయన గాలిగాని సోకిందా? సినీమా మంత్రా లేమిటి?" అని వారించింది సుమతి.

ముకుందంగారు నవ్వేసి ఊరుకున్నాడు. ఇంతలో వెనకటి బాయ్ మళ్ళీ టీ పట్టుకొచ్చాడు.

"ఇదేమిటండీ! అత్తారింట అల్లుడికి చేసే మర్యాదలా ఉంది!" అంది శాంతాదేవి.

"వైకుంఠం అంటే ఏమిటనుకున్నారు" అన్నట్టుగా చూసి "పుచ్చుకోండి. నిద్దర రాదు" అన్నాడు ముకుందంగారు.

"నిద్దరవస్తేగదా పుచ్చుకునేందుకు! పెళ్ళివారి పందిరిలా, యింత కోలాహలంగా ఉన్నప్పుడు నిద్ర ఎలావస్తుంది?" అంది శాంతాదేవి.

ఇంతలో వైకుంఠమే వచ్చాడక్కడికి "ప్రొహిబిషన్ రాక పూర్వం ఎంత బావుండేదనుకున్నారు! ఇప్పుడు కాఫీ టీలతో సరిపుచ్చుకోవలసి వస్తోంది" అన్నాడు స్త్రీలకి విన పడకుండా. అంతకీ శాంతాదేవి పాము చెవులు పెట్టుకు వింటూనే ఉంది.

స్త్రీ లిద్దరికీ ఆ బోయ్ ఈ సారి హార్లిక్సు కలిపి పట్టు కొచ్చాడు. ఏం చేస్తారు తాగక? మొగాళ్ళం మాత్రం టీ తాగి, మళ్ళీ సిగరెట్లు వెలిగించాం.

దండకారణ్యంలో మారీచుడు అరిచినట్టు 'బోయ్' అని అరిచాడు వైకుంఠం. అయిదుగురు కుర్రాళ్ళు మూల మూలల నుంచి పాడిలిపోతూ, ప్రాణాలు అరచేత బట్టుకొనివచ్చారు.

"పక్కాకు" అయిదుగురూ నాలుగు వైపులకీ జారు కున్నారు.

ఆ హుకుమ్‌కి అర్థమేమిటో తమలపాకుల పళ్ళెమూ, వక్కపొడి పళ్ళెమూ మా ముందు ప్రత్యక్షమయేదాకా తెలీలేదు. "రాత్రి పన్నెండు గంటలకి తమలపాకు లేమిటి?" అన్నారు స్త్రీలు.

"సినిమాలోకంలో రాత్రి, పగలూ అను విభేదం లేదు" అంటూ వైకుంఠం కెమెరా వైపుగా వెళ్ళి, తన కుర్చీలో

ఆసీనుడయ్యాడు. నేనూ ముకుందంగారూ తమలపాకులు నమలడం మొదలెట్టాము.

పన్నెండున్నర అయింది. సుమతి ఒక్కసారి ఆవులించి, కళ్ళు నులుపుకుంది. శాంతాదేవి మట్టుకు కెమెరా ట్రాలీ మీద యిటూ అటూ కదలడం పరీక్షగా చూస్తోంది. ముకుందంగారు ఎవరు కెమెరామెనో, ఎవరు సౌండు యింజనీరో, కర్ర నిచ్చెనలమీద వున్న ఫోకసింగ్ లైట్లు ఏర్పాటు చెయ్యడంలో ఎంతటి అనుభవజ్ఞానం ఉండాలో—యిత్యాది సాంకేతిక విషయాలు శాంతాదేవికి వివరించి చెప్పగా, చెవులు వున్నాయి కనక నేనూ సుమతీకూడా విన్నాం.

పన్నెండున్నరకి హీరోయిన్ సెట్టుమీదికి వచ్చింది. ఆమె పేరు మనోరమ. గున్నఏనుగలా ఉన్నప్పటికీ ఆమె గొప్ప డాన్సరట. ఆమె యింకా అయిదునిముషాలకి వస్తుందనగానే, ఎక్కడి వాళ్ళు అక్కడ గప్‌చిప్‌గా ఉన్నారు. మనోరమ అంటే వైకుంఠానికికూడా హడలేనట! ఆమెకి తిక్క ఎత్తుకొచ్చిందంటే, అవతలకొంపలు మునిగిపోతున్నా మేకప్ తీసిపారేసి, ఛలోమని యింటికి పోతుందట. అంచేత సెట్టుమీదఉన్న యావన్మందీ ఆమెకి తిక్క ఎత్తకుండా చూస్తారు. ఈ లోగుట్టులన్నీ మాకు తెలీవు. వైకుంఠంగారు ముకుందంగారికి చెబితే, ముకుందంగారు నాకు చెబితే, నేను ఆడవాళ్ళ చెవిని వేశాను. మనోరమ తిన్నగా వెళ్ళి డైరెక్టర్ గారి పక్కనున్న కుర్చీలోకూచుని, ఫ్లోర్ మీదవున్న మనుష్య

మాత్రులందరిమీదా ఒక్క చూపు విసిరి, డైరెక్టర్ లైటర్ వెలిగించగా, తను సిగరెట్ ముట్టించింది.

"ఆమె ఆడదేనా అండి!" అని అడిగింది శాంతాదేవి; మొగాడు ఆడవేషం వేసుకున్నాడేమో అనుసందేహం కాబోలు.

"అందుకు సంశయమెందుకు ? ఆమె ముగ్గురుపిల్లల తల్లి" అన్నాడు ముకుందంగారు.

"పీపాలాఉన్న ఆ మనిషిడాన్సు ఏమిచేస్తుంది ?" అని సుమతి అంటూవుండగా ఆజానుబాహుడైన భీమారావు ప్రవేశించాడు.

భీమారావు మునిసిపల్ ఛైయిర్ మెన్ (నిజజీవితంలో కాదు, నేటి సెట్టులో). అతను వేశ్యకులంలో జన్మించిన మనోరమని తనతో ఉండమంటాడు. ఆమె శీలవతి. తను సీత, సావిత్రి, దమయంతి వగైరాల్లాటి దాన్నని చెబుతుంది. ఆ పతివ్రతని చెరచబోతాడు దుర్మార్గం తల బెట్టిన భీమారావు. ఇదీ యిప్పుడు తియ్యవలసిన సీను. ఈ కథాభాగాన్ని మూడో సారి టీ పట్టుకొచ్చిన కుర్రాడు. మాకు తన స్వంతమాటలతో చెప్పాడు.

"బేబీరామ్, పన్నెండుగురు ఎక్స్ట్రాలూ ఉన్నారటగా !" అని అడిగింది సుమతి.

"బేబీరామ్ ఛైయిర్ మెన్ గారి రెండో అబ్బాయి. అతనికి కలరావస్తుంది." అన్నాడు టీలు అందిచ్చే అబ్బాయి.

"ఈ రాత్రేనా!" అంది శాంతా దేవి.

ఆ అబ్బాయికి ఈమె ప్రశ్న అర్థంగాక వెర్రిగా చూశాడు. ఇంతలో 'సైలెన్స్' అని ఒకళ్ళ తర్వాత ఒకళ్లు, నాలుగుసార్లు అరిచారు.

సౌండ్ యింజనీరూ, కెమెరామేన్ తాము రెడీ అన్నారు. 'స్టార్ట్' అన్నాడు డైరక్టర్. పల్చటి పావడాతో, లంబాడీ వాళ్ల లంగాతో మనోరమ మహాకులుక్కుంటూ అంది: "ఇది మీకు తగదు. నేను మీ సోదరివంటిదాన్ని."

"మనోరమా, నాకు సోదరి ఉండింది. ప్రియురాలే లేదు. గాన......" భీమారావు యింకా చెబుతూవుండగా, 'కట్-కట్' అని గబగబా అరిచారు. ఏమి ఉపద్రవం జరిగిందా అని కూచున్న సుమతి లేచి నుంచుంది.

మళ్ళీ అంతా చెప్పించారు. ఈసారి మనోరమ అంది. "ఇది మీకు తగదు. నేను మీ సోదరివంటిదాన్ని సీత, సావిత్రి-దమయంతి, అనూరాధ..."

మళ్ళీ 'కట్-కట్' అని కాకుల్లా అరిచారు.

"ఇది మీకు తగదు. నేను మీ సోదరి వంటిదాన్ని. సీత, సావిత్రి, దమయంతీ, అరుంధతి, అనసూయాదులు జన్మించిన భారతభూమిలో..." ఏదో చివరంటా చెప్పింది మనోరమ.

"యాదులు బదులు దాదులు-అంది సార్" అన్నాడు అసిస్టెంట్ డైరెక్టర్.

"అక్కడ యకారం పల్కాను, దకారం పలకవలసిందే!" అన్నాడు కవి తీర్పు చెబుతున్నట్టు.

"నా డ్యూటీ నేను చేశాను. వీళ్లు ఏ గంగలో దిగితే నాకేమి?" అనుకున్నాడు కాబోలు అసిస్టెంట్, మరొక కప్పు టీ తాగి, యింకొక సిగరెట్ వెలిగించాడు.

మనోరమ పెనగులాడటం, భీమారావు దీపం ఆర్పేసి బలాత్కరించబోవడం మర్నాడు తీస్తారట. రెండుంబావుకి బేబీరామ్‌ని పట్టుకొచ్చారు. బేబీరామ్ మొగాడు కాదు; ఆడపిల్ల. ఆడపిల్లకి మొగవేషం వేశారు. ఆ బేబీ గాఢనిద్రలో ఉంది. ఐదేళ్ళ అమ్మాయి నిద్ర కాగగలదూ? వైకుంఠం గారు ఆ పిల్లకి చాకలెట్లు పెట్టాడు, బిస్కట్లు పెట్టాడు, పాలుపట్టించాడు, చివరకు తను ఎత్తుకు తిప్పడం మొదలెట్టాడు. చక్కగా ఆతని బుజంమీద నిద్రపోయింది ఆ పాప.

కాస్త విశ్రాంతి కోసమా అన్నట్టు పిల్లని బుజంమీద వేసుకు మా దగ్గరికి వచ్చాడు వైకుంఠంగారు.

"ఎంత అవస్థపడి పోతున్నారండీ" అంది శాంతాదేవి వైకుంఠంగారిపట్ల సానుభూతి కనబరుస్తూ.

"ఈ బేబీకి ఏమంత పెద్ద వర్కు లేదు. ఆ పక్కమీద పడుకొని 'నాన్నా-నాన్నా' అని అరవాలి-అంతే. ఈ పిల్ల తల్లిదండ్రులు సమ్మర్‌కని రేపు కొడైకెనాల్ వెళ్ళిపోతున్నారు. అరుహూర్తైనా, ఈ రాత్రికి ఈ పిల్లవర్కు పూర్తి చెయ్యాలి."

'బ్రేక్' అనగానే వైకుంఠంగారి దగ్గర సెలవుపుచ్చుకొని, ఆయన కారుమీద, గృహోన్ముఖులయాము.

ఎంతో ఆప్యాయంగా రిసెప్షన్ దాకా వచ్చి మమ్మల్ని సాగనంపాడాయన. కారు ఎక్కినతర్వాత "లక్షలకి లక్షలు ధారపోసి, ఇంత కష్టపడి, వాళ్ళు ఫిలిమ్ తీస్తారు. మనం 'ఎబ్బే' అనేస్తాం" అన్నారు, ముకుందంగారు ఫిలిం పారిశ్రామికులమీద అలవికాని ప్రేమాభిమానాలు చూపిస్తూ.

"షూటింగ్ కంటె, టీలు అందిచ్చి, మనకి కథ చెప్పిన పన్నెండేళ్ళ కుర్రవెధవ బావున్నాడు నాకు. ఏనాటికైనా తను హీరో కాగలనని, ఆ కుర్రాడి ఆశ. వాడికలలు కరిగి పోకుండా ఉంటే బావుండును."

"కరిగిపోని కలలు ఉంటాయా?" అనుకున్నాను. నాలో నేను.

♦ ♦ ♦